క్లుప్తంగా

42 అంశాలకు ఆమోదం


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో 42 అంశాల ఎజెండా ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించినట్లు కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత


పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీతారాములు

మునగాల : మండలంలోని రేపాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బెజవాడ సీతారాములు తన కుమారుడు బెజవాడ శ్రవణ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా పలువురు పేద విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను (గ్రూప్-1,2,3,4) ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, బీఆర్ఎస్ నాయకులు పానుగోటి రంగా, గ్రామపెద్దలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో భక్తిశ్రద్ధలతో సహస్ర కుంకుమార్చన


సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్ చార్యులు, యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యువతపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

మునగాల : క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్న యువతపట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కాసర్ల రాజేష్ ఒక ప్రకటనలో కోరారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో యువత బెట్టింగులకు పాల్పడుతూ ఓడిపోయి సమయానికి డబ్బు చెల్లించలేక తీవ్ర ఒత్తిడికి గురై బలవన్మరణానికి పాల్పడి తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిలుస్తున్నారన్నారు. యువత బెట్టింగులకు పాల్పడకుండా పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజేష్ కోరారు.

బీసీలపై బీజేపీ మొసలి కన్నీరు

గరిడేపల్లి : ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీలపై బీజేపీ పార్టీ మొసలి కన్నీరు కారుస్తుందని బీసీ నేత ధనుంజయనాయుడు ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌ను హడావుడిగా ప్రకటించారని, బీసీ డిక్లరేషన్‌లో అన్నీ అబద్ధాలు నిండి ఉన్నాయన్నారు. తెలంగాణ వస్తే బీసీల తలరాతలు మారుతాయని ఎంతో ఆశపడ్డామని కానీ రాష్ట్రం ఏర్పడిన తరువాత పాలకులు బీసీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు చిలకరాజు శ్రీను, కడియాల అప్పయ్య తదితరులు ఉన్నారు.

పెరుగన్నం, మజ్జిగ పంపిణీ


పంపిణీ చేస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు, క్లబ్‌ల నిర్వాహకుల పెళ్లి రోజు, పుట్టిన రోజు సందర్భంగా, పలువురి జ్ఞాపకార్థం శుక్రవారం ఉష్ణతాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు పాదాచారులు, వీధి వ్యాపారులకు మజ్జిగ, పెరుగన్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, వాసవీ క్లబ్ డిస్ట్రిక్ జనరల్ సెక్రటరీ రాచకొండ శ్రీనివాస్‌రావు, క్లబ్‌ల ప్రధాన కార్యదర్శులు కోటేశ్వర్‌రావు, సంధ్య, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, నాగరాజు, గోపాలకృష్ణ, కిషన్, అశోక్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

డిజైనింగ్ లోపం.. ప్రజలకు శాపం

గరిడేపల్లిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు

- హైవేపై స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో అతివేగంగా వాహనాలు
- 20 రోజుల్లో ముగ్గురు మృతి
- నియంత్రించాలని జనం వేడుకోలు


ప్రధాన రహదారిపై పశువుల సంచారం


అబ్బిరెడ్డిగూడెం వద్ద ప్రమాదకరంగా రోడ్డు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రజలు, ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల జడ్చర్ల- కోదాడ రహదారిని నాలుగు లేన్లుగా మార్చడంతో గరిడేపల్లి మండల కేంద్రంలో రద్దీ మరింత పెరిగింది. అయితే ఈ రహదారికి రోడ్డు విస్తరణకు సరైనా డిజైనింగ్ లేకపోవడం, అతివేగం స్టాఫ్ బోర్డులు, బారికేడ్లు లేకపోవడంతో పాటు వాహనదారులు సరైన రోడ్డు నియమావళి పాటించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆవులు, గేదెలు రోడ్డుపైనే తిరుగుతుండటంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల నిర్మించిన హుజూర్‌నగర్- కోదాడ నాలుగు లేన్ల రోడ్డుపై అబ్బిరెడ్డిగూడెంకు వెళ్లే రోడ్డు సత్రం నుంచి గరిడేపల్లి గ్రంథాలయం వరకు సుమారు కిలో మీటర్‌కు పైగా రోడ్డు పరిధిలో అనునిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అబ్బిరెడ్డిగూడెం మేజర్ వద్ద రోడ్డు మలుపుకు సరైన స్థలం లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా మండల కేంద్రంలో దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు నిలుపుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

20 రోజుల్లో ముగ్గురు మృతి..

గరిడేపల్లి సమీపంలో హైవేపై రోడ్డు ప్రమాదాలకు గురై 20 రోజుల్లో ముగ్గురు మృతి చెందారు. గత నెల 27వ తేదీన రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని జల్లా వెంకటేశ్వర్లు, ఈనెల 14వ తేదీన బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై దాసోజు అంజయ్యచారి మృతి చెందారు. ఈనెల 15వ తేదీన అబ్బిరెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని రావుల రామయ్య మృతి చెందాడు. వీరు ముగ్గురూ గరిడేపల్లికి చెందిన వారే. వీరే కాకుండా ఎంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లతో పాటు ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బారికేడ్లు ఏర్పాటు చేస్తాం



గరిడేపల్లిలో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ముమ్మరం చేస్తాం.

– పి.వెంకట్‌రెడ్డి, ఎస్ఐ, గరిడేపల్లి

కాంగ్రెస్ హయాంలో అందరికీ మేలు

- ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే పద్మావతి


మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో పార్టీలో చేరిన నాయకులు

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు అన్నారు. శుక్రవారం కోదాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మండలంలోని రెడ్లకుంట నుంచి మూడు కుటుంబాలకు చెందిన 20 మంది బీఆర్ఎస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అందరికీ మేలు జరుగుతందని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో అమరబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, మెండె శ్రీనివాస్‌యాదవ్, అమరబోయిన రాముడుయాదవ్‌లు ఉన్నారు. అదే విధంగా గుడిబండకు చెందిన బీజేపీ నాయకుడు ఎరగాని నాగశేషుగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, గంగవరపు లక్ష్మణ్‌రావు, రేవూరి వెంకటాచారి, ఇర్ల సీతరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : క్రీడలు విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీసీరెడ్డి కాన్వెంట్‌లో కోదాడ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఓపెన్ టూ ఆల్ బాస్కెట్ బాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని కోరారు. క్రీడలలో రాణించి కోదాడ పేరును నిలబెట్టాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కందుల కోటేశ్వరరావు, కర్రి సుబ్బారావు, షాబుద్దీన్, ప్రసాద్‌బాబు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజ్, అర్జున్, వినయ్, సాయి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


చిలుకూరు : ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిలుకూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు చిలుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, సైన్స్ టీచర్, ఎన్ఎంఎంఎస్ కోచింగ్ టీచర్ కందిబండ రామారావు తెలిపారు. ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు ఎంపికైన విద్యార్థులు సర్వేష్, వికాస్, కీర్తి, జి.చరణ్‌లను శుక్రవారం పాఠశాలలో వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుడు రామారావును పాఠశాల హెచ్ఎమ్, ఎస్ఎమ్‌సీ చైర్మన్ రఫీ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్ల విద్యార్థి ప్రణవి ఎంపిక


దామరచర్ల ప్రణవి, దిర్శించర్ల

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దామరచర్ల ప్రణవి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు మంగళవారం తెలిపారు. 9, 10వ తరగతిలతో పాటు ఇంటర్మీడియట్ రెండేళ్ల పాటు మొత్తం నాలుగు సంవత్సరాలకు రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. ప్రణవి ఎంపికపై తల్లిదండ్రులు రవి, నాగలత ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎం మధు, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి, సబియా, వెంకటకృష్ణ, శంకర్ తదితరులు అభినందించారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు సాధించాలి


హుజూర్‌నగర్ : సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


మునగాలలో సుందరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు నేటి యువత కృషిచేయాలని పలువురు సీపీఎం నాయకులు కోరారు. సుందరయ్య 38 వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. నిజాం రాజుకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి తగు సూచనలు, సలహాలతో మార్గదర్శకత్వం వహిస్తూ ఆ పోరాటానికి గెరిల్లా శిక్షణ ఏర్పాట్లు చేసేవాడని, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మునగాల పరగణా ప్రాంతంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సాయుధులై నిజాం సైన్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగించిన వారిలో సుందరయ్య ప్రముఖుడన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు బచ్చల కూర స్వరాజ్యం, షేక్ సైదా, వి.వెంకన్న, డి.స్టాలిన్ రెడ్డి, బి.కృష్ణారెడ్డి, బి.నాగయ్య, ఆర్.లింగయ్య, ఎస్.పిచ్చయ్య, ఎం.వెంకటాద్రి, వివిధ గ్రామాల కార్యదర్శులు సైదులు, వీరస్వామి, శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, చిన్న సైదులు, జి.వినోద్, బ్రహ్మం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : పుచ్చలపల్లి సుందరయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బూరుగడ్డ మాచవరంలో మార్కిస్ట్ ఉద్యమ కెరటం పుచ్చలపల్లి సుందరయ్య 38 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తన ఆస్తిని పేదలకు పంచిన గొప్ప వ్యక్తి సుందరయ్య అని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు మీగడ రాములు, చందాల భిక్షం, వెంకటరెడ్డి, మాధవరావు, సైదులు, వెంకటరెడ్డి, నాగరాజు, వెంకన్న, సైదులు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం విప్లవ సందేశం

హుజూర్‌నగర్ : సీపీఎం నేత దివంగత పుచ్చలపల్లి సుందరయ్య జీవితమే ఓ విప్లవ సందేశమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలోసుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం ప్రజలతో మమేకమై పనిచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, కౌన్సిలర్ త్రివేణి, నాయకులు శీలం శ్రీను, టి.యోన, మురళి, వీరమల్లు, పి.నాగేశ్వరరావు, వెంకటనారాయణ, టి.వీరయ్య పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

చింతలపాలెంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వట్టెపు సైదులు, సుందరమౌళీశ్వర రెడ్డి, సైదులు, పుల్లయ్య, సత్యనారాయణ, మైబెల్లి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయసాధనకు కృషిచేయాలి

నేరేడుచర్ల : కమ్యూనిస్టు ఉద్యమ నేత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక అరిబండి భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, తిరుపతయ్య, నీలా రామ్మూర్తి, వరలక్ష్మి, రుద్రమ్మ, శ్రీనివాస్‌రావు, నరసింహ, ఏసు, పటాన్, జానీ తదితరులున్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సుందరయ్య వర్ధంతి

నడిగూడెం : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో దివంగత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, నాయకులు కొరట్ల శ్రీనివాస్, బీరవల్లి సుధాకర్ రెడ్డి, కాసాని కిషోర్, అనంతుల కృష్ణయ్య, వెంకన్న, నాగార్జున, శ్యామ్, తిరపయ్య, పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

మఠంపల్లి : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన సీపీఎం నాయకుడు పాదిల సైదులు కుటుంబానికి సీపీఎం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ధీరావత్ రవినాయక్, జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండు నాయక్, మాలోతు బాలునాయక్, జగన్‌మోహన్ రెడ్డి, వినోద్‌నాయక్, తిరుపతయ్య, శంభయ్య, కోటయ్య, తదితరులు ఉన్నారు.


మఠంపల్లిలో..


నడిగూడెంలో..


నేరేడుచర్లలో ..

బాలఉగ్రనరసింహస్వామి దర్శనానికి బారులు


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో స్వయంభు వెలసిన దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రనరసింహస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శుక్రవారం కావడంతో ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 30 వేలకు పైగా భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. కోరిన కోరికలు నెరవేరుతున్నాయనే నమ్మకంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా దాదాపుగా రెండు కిలోమీటర్ల మేర భక్తులు క్యూలో నిలబడ్డారు. దర్శనానికి దాదాపుగా గంటన్నరకు పైగానే సమయం పట్టింది. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా


హుజూర్‌నగర్ : గంగమ్మ ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న ఓజో చైర్మన్ పిల్లుట్ల రఘు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : నియోజకవర్గ ప్రజలు రాబోయే రోజుల్లో ఒక్క అవకాశం ఇస్తే మీ భవిష్యత్ మార్చి చూపిస్తానని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలంలోని దొండపాడులో గంగమ్మ ఆలయ అభివృద్ధికి ఓజో ఫౌండేషన్ తరఫున రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అని విధాలుగా అభివృద్ధి చేసి చూపుతామన్నారు. మన చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమలలో మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాదేనని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కె.వెంకన్న, సైదులు, శివారెడ్డి, సునిల్, అంజి, దొండపాడు ఫౌండేషన్ సభ్యులు, యాదవ సోదరులు వీరబాబు, రాంబాబు, రసూల్, సైదా, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎల్లప్పుడూ సహకరిస్తా

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఉస్మానియా మసీద్‌లో ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.54 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, షెడ్‌ను ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు శుక్రవారం ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పిల్లుట్ల రఘు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారం ఉంటుందన్నారు. ముస్లింకోసం కొన్ని గ్రామాలలో పీర్ల చావిడీలు, మరికొన్ని గ్రామాలలో వాటర్ ప్లాంట్‌లు, ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశామని, రంజాన్ తోఫాలు అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ముస్లింలు రఘును శాలువ, పూలమాలలతో సన్మానించారు.కార్యక్రమంలో మసీద్ పెద్దలు, నాయకులు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం


హుజూర్‌నగర్ : కంటి వెలుగు సిబ్బందిని సన్మానించిన చైర్‌పర్సన్ అర్చన, నాయకులు


కోదాడరూరల్ : కూచిపుడితండాలో కంటి వెలుగు కార్యక్రమంలో ఎంపీటీసీ, సర్పంచ్

హుజూర్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పట్టణంలో విజయవంతంగా ముగిసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, క్యాంపు కోఆర్డినేటర్ ఇందిరాల రామకృష్ణ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో గత ఐదు నెలలుగా వైద్య సేవలందించిన కంటి వెలుగు సిబ్బందిని శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 17 వార్డులలో 10,331 మందిని పరీక్షించి 2,172 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. 787 మందికి ఆర్డర్ ద్వారా కళ్లజోళ్లను అందించి 1863 మందిని కంటి ఆపరేషన్లకు రిఫర్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నాగేశ్వరరావు, డాక్టర్ సుష్మ, ఆప్తమెట్రీషియన్ మల్లిక, శివ, ఏఎన్ఎంలు హైమావతి, కవిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : అంధత్వంతో ప్రజలు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారని కూచిపుడి ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కూచిపూడితండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదా, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ వాణిశివప్రియ, డాక్టర్ హేమంత్, సుజాత, సంతోషమ్మ, అన్నమ్మ, పద్మ, సువార్త, సుశీల, అలివేలు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


నడిగూడెంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులైజ్ చేయాలని నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీఆర్‌ఏలు శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కోచైర్మన్ ఎల్.నర్సింహారావు, పి.వీరబాబు, చిన్న వీరయ్య, సతీస్, చిన్నయ్య, నవత, ఖాసీం, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెంలో...

చింతలపాలెంలో వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సైదా, కొండలు, ఏలియా, నాగేశ్వరరావు, వీరబాబు, నాగరాజు, కాశయ్య, నరసింహారావు, మట్టయ్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో..

నడిగూడెం : వీఆర్‌ఏలకు రెగ్యులర్ పేస్కేలు వర్తించేలా చూస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు బండారు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, వెంకమ్మ, భద్రయ్య, నాగమ్మ, పల్లపు శ్రీను, నేలమర్రి శ్రీను, పరమానందం, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయాలని, రెగ్యులర్ పేస్కేల్‌పై వర్తించేలా క్యాబినేట్‌లో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో నేరేడుచర్లలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షురాలు పెరుమాళ్ల పిచ్చమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో 23 వేల కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సైదా, ఝాన్సీ, చంద్రకళ, రాధ, శోభ, అనిల్, నాగలక్ష్మి, నాగయ్య, సైదులు, ఖాదర్, అంతయ్య తదితరులున్నారు.


నేరేడుచర్లలో..


హుజూర్‌నగర్ : చింతలపాలెంలో

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి


మఠంపల్లి : యాతవాకిల్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, సర్పంచ్

మఠంపల్లి : మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ మామిడి జానకిరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు యాతవాకిల్ల, దొనబండతండా, కొత్తతండా, తదితర గ్రామాలలో మినీ పల్లె ప్రగతి పనులను ఎంపీఓ ఆంజనేయులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈనెల 23 వరకు అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, కోలాహలం లక్ష్మీనరసింహరాజు, పాండునాయక్, సుజాతా సక్రునాయక్, కార్యదర్శులు, వార్డుసభ్యులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ

గరిడేపల్లి : ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కల తొలగింపు, ట్యాంకుల క్లీన్, నిల్వ ఉన్న మురుగునీటిలో బ్లీచింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా, ఉప సర్పంచ్ సైదాబీ, కార్యదర్శి రేణుక, వార్డు సభ్యులు నారాయణ, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత, ఏఎన్ఎం కవిత, రాజా మహ్మద్ తదితరులు ఉన్నారు.